దివాస్వప్నం :

# మధుర స్వప్నాల విచిత్ర చిత్రం

శాంతి కృష్ణమూర్తి

రైలు దిగగానే పాత పరిచయ స్థలాలన్నీ సంతోషంతో ఆహ్వానిస్తున్నాయి! ఓవర్ బ్రిడ్జి దాటుతుంటే మచ్చకొండ కొత్త అందంతో పిలుస్తోంది! సంస్థానం రోడ్డుమీదినించి వస్తుంటే, భోగందాని మేడ, దాని వెనక మచ్చకొండ మళ్ళీ ఆ పాత అద్భుతమైన దృశ్యంగా ఏర్పడుతున్నాయి. ఛోటా హిమాలయా (వెలగాడ కొండ) మేఘాలలో తప్పడుపోయి డాల్ఫిన్సునోస్‌లా ఏర్పడుతోంది.

ఇంకా ఈ కోట అదీ ఇల్లాగే ఉన్నాయి! ఆశ్చర్యంతో అడిగాను "ఈ ఫ్యూడలిస్టు చిహ్నాల్ని ఇంకా ఉంచారా!" అని. ప్రపంచమంతా పెట్టుబడిదారీ యుగంనించి సోషలిస్టు యుగంగా మారుతుంటే, ఇంకా ఫ్యూడలిస్టు స్టేజిలో ఉన్న మా చిన్ననాటి దేశపరిస్థితులు జ్ఞాపకం వస్తున్నాయి.

సీత అంటోంది "అందరూ పడగొట్టెయ్యాలన్నారు కాని కొందరు ఆర్టిస్టు భావాలు నొచ్చుకోడంవల్ల ఉండనీ వల్సొచ్చింది. ఇప్పుడు దీన్ని 'కిండర్ గార్టెన్సు'గా ఉపయోగిస్తున్నాం!"

"రాజ కుటుంబీకులు?" అన్నా.

"వాళ్ళలో కొందరు విప్లవ వ్యతిరేకులైన వాళ్ళు చంపివేయబడ్డారు. తక్కిన వాళ్ళు ఆస్థి సమాజపరం చేసి, మిగతా ప్రజలతోపాటు కష్టపడడానికి ఒప్పుకున్నారు. అందులో ఒకతను ఇప్పుడు ఆంధ్రా యూనివర్సిటీలో ప్రొఫెసరుగా ఉంటున్నాడు" సీత కళ్ళు విప్లవాన్ని సూచిస్తున్నట్టు మెరుస్తున్నాయి.

అంతా బాగుంది! ఊళ్ళోకి వస్తున్న కొలదీ పెద్ద అంతస్థుల మేడలన్నీ పైకెగురుతున్నాయి"

"ఇదేమిటి?" అన్నా ఎంతో ఎత్తుగా ఉన్న మేడను చూస్తూ.

ఇదే తెలీదా? అన్నట్టు చూస్తూ సీత చెబుతోంది "పూర్వం మ్యూజిక్ కాలేజీ అనే వారు చూశావా? అదీ ఇది. ఆంధ్రదేశమ్మీద సంగీత విద్యకు కేంద్రస్థానం ఇప్పుడు. మొదటి రోజుల్లో కొందరు సంగీత విద్వాంసులు సంగీతాన్ని ప్రజావిద్య చేయడానికి వ్యతిరేకించారు. కాని ద్వారం వంటి వాళ్లు స్వార్థరహితంగా, విప్లవ సమయంలో భయపడకుండా సంగీతాన్ని ప్రజల కళగా మార్చడానికి పూనుకున్నారు."

కోట ఏం మారలేదు. చారిత్రక చిహ్నంగా కనబడుతోంది. కవి రాజభోగంతో ఎవర్ని లెక్క చెయ్యకుండా తలెత్తమని లేదు. ప్రజలకి దాసురాల్ని అన్నట్టు తలవంచుకుని ఉంది!

ఇంతవరకు భోగందాని మేడ అనుకుంటున్న భవనం దగ్గరకి వచ్చాం. "మహిళా సంఘం ఆఫీసు. 1960లో విప్లవ సమయంలో తెరవబడింది" అని ఉంది. సీత మహిళా సంఘ ఆర్గనైజర్సును పరిచయం చేస్తానంటోంది. కాని నాకు ముందర కురికి ఘాటో చూడాలని ఉంది!

నడుస్తూంటే, సాంస్క్రిట్ కాలేజి, హోమిక్ హాస్టల్‌లో వచ్చిన మార్పుల్ని గురించి చెబుతోంది! బంకుల దిబ్బ దగ్గరికి వచ్చేటప్పటికి కోటలోంచి చిన్నపిల్లలు పాడుతున్న "అంతర్జాతీయ గీతం" వినబడుతోంది. ఎర్ర జెండా ఆకాశంలో రెఫ రెఫా కొట్టుకుంటోంది.

సీత అంది "ఆ స్వాతంత్ర్యం శాంతి!! అభ్యుదయాలలో ఎగిరే జెండాని చూశావా? అదే గురజాడ అప్పారావుగారి ఇల్లు. దాన్ని చారిత్రక స్థలంగా అభ్యుదయ రచయితల సంఘంవాళ్లు కాపాడుతున్నారు. ఈ యేడు ఆ వార్షికోత్సవానికి వచ్చినప్పుడు ఈ స్థలాన్ని చూడకుండా వెళ్ళలేక పోయేడు శ్రీ శ్రీ"

గురజాడ అప్పారావుగారి ఇల్లొకటే సాధారణ గృహంగా ఉంది ఆ వీధిలో. తక్కినవన్నీ పెద్ద భవనాలగా మారాయి!

"సాధారణమైన గృహమైనా ఎంతో ఉద్రేకాన్ని ఉత్సాహాన్ని ఇస్తుంది ఈ ఇల్లు!" అని శ్రీ శ్రీ అన్నట్టు చెప్పింది సీత!

మళ్ళీ ఇద్దరం బయలుదేరేం.

ఎందుకో అకస్మాత్తుగా కోవెల వీధి జ్ఞాపకం వచ్చింది. 'మరి టెంపిల్ స్ట్రీట్' అన్నాను

అక్కడ వచ్చిన పరివర్తనాలేమిటో తెల్సుకుందాం, మని.

"ఇప్పుడు స్త్రీలు శరీరాన్ని అమ్ముకోవల్సినంత అగత్యమేం లేదు. అందరూ చదువుకుని విద్యావంతు లయ్యారు. వాళ్లందరూ మిస్ట్రెస్‌లగాను, నర్సులగానూ పని చేస్తున్నారు" అంది ఉత్సాహంతో సీత! ఇల్లాంటిపరివర్తనాలు తీసుకురావడానికి ఎంత కష్టపడాల్సొచ్చిందో మహిళా సంఘంలో పనిచేసిన ఆమెకు తెల్సు.

సీత చెప్పడం మానేసి నిశ్శబ్దంగా నడుస్తోంది, నేను అందమైన భవనాల్ని, ఉత్సాహంలో నవ్వుతూ కేరింతలు కొడ్తున్న పిల్లల్ని చూస్తున్నా చాలా సంతోషంగా.

ఆ రోజుల్లో ఆ బానిస మన స్తత్వంలో ఇల్లాంటి రోజు లొస్తాయని యెప్పుడన్నా కలలన్నా కన్నామా అని ఆలోచిస్తున్నాను.

ఈ నల్ల చెరువు రాళ్ళన్నీ చిన్నతనపు స్నేహాల్ని తల్చుకుంటూ నవ్వుతూ ఆహ్వానిస్తున్నాయి! చిన్నప్పుడు శ్రీని అన్నమాటలు జ్ఞాపకం వస్తున్నాయి! "అలాంటి ఏ ప్రకృతి దృశ్యాలు ఉద్రేకపర్చకపోతే శ్రీ శ్రీ అలాంటి చక్కని రచనలు సాగించ గలిగాడు" అని.

అవును! వింత ఉద్రేకాన్ని, ఉత్సాహాన్ని ఇస్తాయి ఈ దృశ్యాలు! వీటినే చలం అన్నట్టు — ఏ తెరమీదో చూసి ఆనందిస్తారు మనవాళ్లు. కాని యధాతథంగా సహించలేరు!

కాని ఆ రోజుల్లో వీటిని అనుభవించేందుకు తీరిక వుండేది కాదు. ,ఏ పార్కులోనో చేరి, ఆనాటి రాజకీయాలు చర్చించడంతోనో, లేకపోతే దేశంలో ఏ కొత్త ప్రతిష్ఠంభన, ఏ కొత్త కరువు, ఏ కొత్త ప్రాబ్లెం వస్తుందో అని భయపడ్డంతోనే సరిపోయేది!

దూరాన సముద్రం కనబడుతోంటే ఆ చల్లని గాలిలో, ఆ ప్రకృతి దృశ్యాల్లో ఎంతసేపు అలా కూర్చున్నామో! కనోరు పార్కులో రైన్‌కోట్ మీద వనజిల్లుపడుతుంటే ప్రకృతి దృశ్యాల్ని, యూకలిప్టస్ చెట్ల సంగీతాన్ని వింటూ మైమర్చిన సంగతి జ్ఞాపకం వచ్చింది!

పిచ్చిగా ఆలోచిస్తూ, మాట్లాడకండా ఉన్న నన్ను "వెళ్లిపోదామా?" అని సీత కదిపేవరకు ఆ దృశ్యాల్ని చూడ్డంలో లీనమై పోయాను.




ఆరోగ్యజీవనము

మీ అందుబాటులోనే వుంది

మనం ప్రకృతికి దూరమౌతున్నాము

అటులనే ఆరోగ్యానికినీ

కాని, గృహిణి ఆరోగ్యముగ వుండనియెడల మొత్తము గృహమే అనారోగ్యమై అనాకర్షవంతమై వుంటుంది. స్త్రీ ఆరోగ్యమును ఏ పరిస్థితులందైనను కాపాడుకోవాలి. స్త్రీకి ఆరోగ్యజీవనము అందుబాటులోనే వుంది.

"లోధ్ర" స్త్రీలకు ఆరోగ్యజీవనమును ప్రసాదిస్తుంది. లోధ్ర సేవనము గర్భాశయ రోగములను నిర్మూలించి సౌందర్య సౌఖ్యజీవనమును ప్రసాదిస్తుంది.

సుదతుల సౌఖ్య సౌందర్య జీవనమునకు

లోధ్ర

కేసరి కుటీరం లిమిటెడ్., మద్రాసు.

తెలుగుజిల్లాలకు, నైజాముకు ఏజెంట్లు:

సీతారాం జనరల్ స్టోర్సు, బెజవాడ.